సాక్షి ప్రకాశం

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



గమ్యం చేరని గమనం

పెద్దదోర్నాల మండలంలోని కర్నూలు–గుంటూరు రోడ్లతో పాటు, శ్రీశైలం ఘాట్ రోడ్డులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జరుగుతున్న ప్రమాదాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

- IIలో..



తాగునీటి అవసరాలు తీర్చాలి

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
33 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

అన్నపూర్ణాదేవిగా వల్లూరమ్మ



టంగుటూరు: మండలంలోని వల్లూరమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో వల్లూరమ్మ తల్లిని అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బీ రమేష్ తెలిపారు.

అవినీతికి హామీ

ఉపాధి హామీ పథకంలో తవ్వేకొద్దీ అవినీతి, అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు కూడబలుక్కొ మేసినోడికి మేసినంత అన్నట్లు ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నారు. ఎక్కడో అమెరికాలో ఉద్యోగాలు చేసుకుంటున్న వారిపేరు మీద మస్టర్లు వేయడం, చనిపోయిన వారి పేరుమీద కూడా మస్టర్లు వేసి అందిన కాడికి సొమ్మును స్వాహా చేసేస్తున్నారు. ఈ పథకం ద్వారా నాటిన చెట్లకు పండ్లు కాయలు కాయడంలేదు కానీ అధికారుల జేబులు నిండుతున్నాయని చెవులు కొరుక్కుంటున్నారు. అక్రమాలను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలు సైతం ప్రహసనంగా సాగుతుండడంతో అక్రమాలకు అంతే లేకుండా పోతోంది.

- ఉపాధి హామీలో విచ్చలవిడిగా అవినీతి
- ఒక్క పెద్దారవీడు మండలంలో రూ.6 కోట్ల మేర అక్రమాలు
- నామమాత్రంగా సామాజిక తనిఖీలు
- జరిమానాలతో సరిపెడుతున్నట్లు ఆరోపణలు
- అమెరికాలో ఉన్నవారికి, మరణించిన వారికి మస్టర్లు
- తీరుమారని ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పనితీరు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలోని 38 మండలాల్లో మొత్తం 4.41 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 3.82 లక్షల కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. 8.13 లక్షల మంది కూలీలు ఉండగా, వీరిలో 6.78 లక్షల మంది కూలీలు యాక్టివ్‌గా ఉన్నారు. ఉపాధి హామీ నిధులతో సీసీ, బీటీ రోడ్ల పనులు, గోకులం షెడ్లు, పచ్చగడ్డి పెంపకం, ఇంకుడు గుంతల పనులన్నీ అధికార కూటమి నేతలు తమకు నచ్చిన వారికి కేటాయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏ మండలంలో చూసినా కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర అధికారులు, కలెక్టర్ ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నకు సమాధానం దొరకడం లేదని ఆ శాఖ ఉద్యోగులే గుసగుసలాడుకుంటున్నారు. డ్వామాలో సామాజిక తనిఖీల డ్రామా కొనసాగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సిబ్బంది అవినీతిని స్వయంగా జిల్లా అధికారులే కాపుకాస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెరవెనుక డీల్ చేసుకొని జరిమానాలతో సరిపుచ్చుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రూ.6 కోట్లకు పైగా అవినీతి...

జిల్లాలో నిరంతరాయంగా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. మాట వినని ఉద్యోగులను లొంగదీసుకోవడానికి సామాజిక తనిఖీలను ఆయుధంగా ప్రయోగిస్తున్నరన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల దర్శి, పెద్దారవీడు మండలాల్లో జరిగిన సామాజిక తనిఖీలపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దారవీడు మండలంలో జరిగిన అవినీతిపై పెద్ద దుమారం రేగింది. ఈ మండలంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 2024–25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల్లో ఏకంగా రూ.6 కోట్ల భారీ అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీలో గుర్తించారు. మొత్తం 637 పనులు చేసినట్లు రికార్డుల్లో చూపెడుతున్నారు. అధికార తెలుగు దేశం పార్టీ నాయకులు, ఉపాధి సిబ్బంది కలిసి భారీ మొత్తంలో అవినీతికి పాల్పడినప్పటికీ అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి. అలాగే దర్శి మండలంలో జరిగిన ఉపాధి పనుల మీద ఇటీవల సామాజిక తనిఖీ జరిగింది. ఈ మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటకుండానే నాటినట్లు డబ్బులు డ్రా చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మరికొన్ని గ్రామాల్లో పంట కాల్వల నిర్మాణానికి సంబంధించిన పనుల్లో అవినీతి జరిగినట్లు తెలిసింది. మొత్తం మీద 1444 పనులకు గాను సుమారు రూ.10 లక్షలకు పైగా అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు.

అధికారుల అండదండలతోనే అవినీతి...

జిల్లా ఉపాధి హామీలో అక్రమార్కులు బరితెగించడానికి కారణం అధికారుల అండదండలేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలవారీగా మామూళ్లు ముట్టచెబుతున్నాం కనుక మనమేం చేసినా చెల్లుబాటవుతుందన్న భరోసాతోనే కిందిస్థాయి సిబ్బంది విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నట్లు సమాచారం. ఒక్క దర్శి మండలంలోని ఒక గ్రామంలోనే భారీ స్థాయిలో అవినీతి జరిగిందంటే ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బంది ఏ మేరకు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారో అర్థం చేసుకోవచ్చని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు.

పనిచేసినా వేతనం లేదు...

జిల్లాలోని కురిచేడు మండలంలో ఒక మహిళ గత పదేళ్లుగా ఉపాధి హామీ పనులకు వెళుతోంది. అయితే ఆమె వేతనం బ్యాంకులో జమ చేస్తున్నట్లు చెప్పిన స్థానిక సిబ్బంది ఆ వేతనాన్ని దిగమింగారు. వేతనం కోసం ఆమె బ్యాంకుకు వెళితే ఒక్క రూపాయి కూడా జమ కాలేదని తెలిసి ఆమె బిత్తరపోయింది. గత రెండేళ్లుగా ఆమె వేతనం కోసం అధికారులు, స్థానిక సిబ్బంది చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఎలాంటి సమాధానం రావడం లేదు. చివరికి పీడీ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. పోయిన డబ్బులు తిరిగి రావు కానీ కొత్తగా మరో జాబ్‌కార్డు రాయించుకోవాల్సిందిగా ఉచిత సలహా ఇచ్చినట్లు ఆమె వాపోతున్నారు. ఇలాంటి బాధితులు ఎంతో మంది ఉన్నారు.

మొక్కలు నాటకుండానే...

దర్శి మండలంలో చందలూరు, వెంకట చల్లం పల్లి, పోతవరం, మారెడ్డిపల్లి, బసివిరెడ్డిపల్లి, భీమవరం, తూర్పు వెంకటాపురం, జముకుల దిన్నె, పొతకమూరు తదితర గ్రామాల్లో అక్రమాలు జరిగినట్లు తనిఖీ అధికారులు నిర్ధారించారు. ఆయా గ్రామాల్లో మొక్కలు నాటకుండా, పంట కాల్వలు నిర్మాణం చేయకుండానే బిల్లు చేసుకొని లక్షల కొల్లగొట్టారన్న ఆరోపణలు వస్తున్నాయి. పెద్దారవీడు మండలంలోని అన్నీ పంచాయతీల్లోనూ ఇదే తరహాలో అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. మొత్తం 19 పంచాయతీలు ఉండగా అధికార పార్టీ నాయకులు, సిబ్బంది కూడబలుక్కొని అవినీతికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. యర్రగొండపాలెం మండలంలో టీడీపీ ఇన్‌చార్జి అనుచరులు జాబ్ కార్డుకు వంద రూపాయల ప్రకారం వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మరణించిన వారిపేరు మీద మస్టర్లు...

బతికి ఉన్న వారు పనులు చేసినా వేతనాలు వేయకుండా మింగేస్తున్న సిబ్బంది చనిపోయిన వారిని కూడా వదిలిపెట్టడం లేదు. మరణించిన వారి వివరాలను సేకరించి వారి పేర్ల మీద జాబ్ కార్డులు సృష్టించి మస్టర్లు వేస్తున్నారంటే ఎంతగా బరితెగించారో అవగతమవుతుంది. జిల్లాలోని బేస్తవారిపేట, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లల చెరువు, పెద్దారవీడు, దర్శి, కొనకనమిట్ల తదితర మండలాల్లో మరణించిన వారిపేర్ల మీద మస్టర్లు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పెద్దారవీడు మండలంలోని తోకపల్లి పంచాయతీ పరిధిలో మూడేళ్ల క్రితం మరణించిన వారికి మస్టర్లు వేసినట్లు తనిఖీ బృందం విచారణలో తేలింది. దర్శి మండలంలోని గ్రామాల్లో కూలీలు పనులకు రాకపోయినప్పటికీ మస్టర్లు వేసినట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం ఎయిడెడ్ ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం పని చేస్తున్న 765 ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే 3 వేల మంది ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, పదోన్నతుల సమస్య, 150 మంది ఎయిడెడ్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల సమస్య పరిష్కరించాలని, 30 వేల మంది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు.

సీనరేజ్ ప్రైవేటు వసూలుకి రంగం సిద్ధం



రామతీర్థం సెంటర్లో ఉంచిన ఏఎంఆర్ సంస్థ చెక్‌పోస్టులు

చీమకుర్తి రూరల్: గ్రానైట్, ఇతర క్వారీల నుంచి వచ్చే నెల 1వ తేదీ నుంచి సీనరేజ్ వసూలు చేయడానికి ఏఎంఆర్ సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా చీమకుర్తి, రామతీర్థం పరిధిలో పలు ప్రాంతాల్లో ఏఎంఆర్ సంస్థ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రానైట్ ఇతర క్వారీల నుంచి సీనరేజ్ వసూలు చేసే కాంట్రాక్టు కోసం ప్రభుత్వానికి రెండేళ్లలో రూ.1136 కోట్లు చెల్లించేలా ఏఎంఆర్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. కానీ ఇటీవల రామతీర్థం వీటీసీ సెంటర్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీల అసోసియేషన్‌ల అధ్యక్షులు, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు సీనరేజ్ వసూలు ఏఎంఆర్ సంస్థకు అప్పగించడం పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సీనరేజ్ వసూల పై విధి విధానాలు ముందుగా గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులతో చర్చించకపోతే అక్టోబర్ 1వ తేదీ నుంచి ఫ్యాక్టరీలు మూసివేస్తామన్నారు. ఏఎంఆర్ సంస్థ మాత్రం ఇప్పటి వరకు సీనరేజ్ వసూలుపై గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులతో చర్చించకుండా తనపని తను చేసుకుంటూ పోతోంది.

జిల్లాలో అర్ధరాత్రి భూకంపం

ఒంగోలు టౌన్: జిల్లాలో అర్ధరాత్రి భూమి కంపించింది. అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నిద్రలో పెద్ద శబ్దాలు వినిపించడంతో ఏమైందో అర్థంకాక ఇంటి నుంచి బయటకు పరుగులు దీశారు. ఒంగోలు నగరంలోని ఇస్లాంపేట, గోపాల్‌నగర్, కమ్మపాలెం, నీలంపాలెం, బండ్లమిట్ట, గాంధీరోడ్డు, బలరాం కాలనీ, కేశవరాజుకుంట, బిలాల్ నగర్, సిఎస్‌ఆర్ శర్మ కాలేజీ, దేవుడి చెరువు, సంతపేట, రాంనగర్ తదితర ప్రాంతాలలో అర్ధరాత్రి 2 గంటల సమయంలో కంపించింది. దీని ప్రభావంతో ఇళ్లలోని వస్తువులు శబ్దం చేస్తూ కిందకు పడిపోయాయి. మంచం లాగేసినట్లు కదిలిపోయిందని ఇస్లాంపేట ప్రజలు చెప్పుకుంటున్నారు. శర్మ కాలేజీ సమీపంలో ఒక మహిళ ఇంటి నుంచి బయటకు వచ్చి పరిశీలించడం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. రిక్టర్ స్కేలుపై 3.4 తీవ్రతతో భూకంపం నమోదైనట్లు భూకంపం అధ్యయన కేంద్రం అధికారులు తెలిపారు. ఒంగోలుతో పాటుగా సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులప్పలపాడు, చీమకుర్తి, దర్శి, మార్కాపురం, పొదిలి తదితర ప్రాంతాలలో కూడా భూ ప్రకంపనలు కనిపించినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు.

నీటి వనరుల నిర్వహణపై దృష్టిపెట్టండి

- నీటిపారుదల శాఖల అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాజా బాబు

ఒంగోలు సబర్బన్: ప్రతి నీటిబొట్టు జిల్లా ప్రజలకు ఉపయోగపడేలా ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులకు స్పష్టం చేశారు. నీటిపారుదల, ప్రాజెక్టుల అధికారులతో బుధవారం ప్రకాశం భవనంలోని తన చాంబర్లో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సరఫరా, నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఈ దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ తరహా జలాశయాలు, వాటి నిలువ సామర్థ్యం, ప్రస్తుతం నిల్వ ఉన్న నీళ్ల పరిమాణం, వాటి పరిధిలోని ఆయకట్టు వివరాలను ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని ప్రధానమైన వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టుల నిర్మాణ స్థితిగతులు, నిర్వహణ తీరును ప్రాజెక్టుల ఎస్ఈ అబూత్ అలీం వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలోని పరిస్థితుల దృష్ట్యా నాగార్జునసాగర్ నీటిని, స్థానిక జలాశయాల్లోని నీటిని సమర్థంగా వినియోగించుకోవాల్సి ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ శాఖలకు సంబంధించిన సేవలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేలా కలెక్టరేట్లో ప్రత్యేకంగా శాశ్వత ప్రాతిపదికన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నీటి వనరుల నిర్వహణను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునేలా 'ప్రకాశం జిల్లా వాటర్ మేనేజ్మెంట్ సిస్టం' పేరుతో ప్రత్యేకంగా ఒక యాప్‌ను తయారు చేసి ఈ కేంద్రానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ జలాశయాలను జియో కోఆర్డినేటర్స్ ఆధారంగా ఈ యాప్ తో అనుసంధానం చేయాలన్నారు. జలాశయాలకు పెండింగ్‌లో ఉన్న మరమ్మతులు, ఇతర నిర్వహణ అంచనాలను త్వరగా రూపొందించాలని ఆదేశించారు. మైనర్ చెరువుల్లోని మట్టిని స్థానికులు ఉచితంగా తీసుకువెళ్లేందుకు అనుమతించేలా రాష్ట్ర ప్రభుత్వానికి పంపించేందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని చెప్పారు. నాగార్జునసాగర్ కాలువ ద్వారా దర్శి నుంచి పొదిలికి మంచినీళ్లు సరఫరా చేసేలా పైపులైన్ల పనులు త్వరగా పూర్తిచేసేలా సంబంధిత కాంట్రాక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ.బాలశంకరరావు, ఇరిగేషన్, ప్రాజెక్టుల ఈఈలు, డీఈఈలు, భూగర్భ నీటివనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వందనం, ఏపీఎస్ఐడీసీ అధికారులు పాల్గొన్నారు.









వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న వారిలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రులు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ఆదిలమూపు సురేష్, మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు, నెల్లూరు, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, కదిరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి, ఒంగోలు



మార్పే లక్ష్యంగా ముందుకు..

- పోలీసుల్లో జవాబుదారీతనం పెంచడమే ధ్యేయం
- అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం
- గంజాయి సంగతి తేలుస్తాం
- మహిళల భద్రతకు ప్రాధాన్యత
- మరింత విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్
- ప్రాపర్టీ కేసుల్లో పురోగతిపై దృష్టి
- ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పోలీసుల్లో జవాబుదారీతనం పెంచడమే తన లక్ష్యమని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి నుంచి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇక్కడి స్థితిగతులను పరిశీలించేందుకు ఆయన పర్యటిస్తున్నారు. ఒకవైపు జిల్లా పరిస్థితిని అధ్యయనం చేస్తూనే.. మరోవైపు సామాజిక బాధ్యత దిశగా పోలీసుల్లో కదలిక తీసుకొస్తున్నారు. బుధవారం సాక్షి ప్రతినిధితో మాట్లాడిన ఎస్పీ.. తన ప్రధాన లక్ష్యాలను వివరించారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతానని స్పష్టం చేశారు. గంజాయి కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కు కృషి చేస్తామన్నారు. పోలీసుల్లో జవాబుదారీతనం పెంచడం, అవినీతికి తావులేకుండా చేయడం తన ముందున్న లక్ష్యాలన్నారు. ప్రశాంతంగా వుండే జిల్లాగా వున్న పేరును నిలబెట్టేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు పుట్టిన గడ్డ మీద ఎస్పీగా పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఇదే స్ఫూర్తితో జిల్లా ప్రజలకు సేవలందిస్తానని స్పష్టం చేశారు.

ప్రజల భాగస్వామ్యంతో గంజాయి కట్టడి...

జిల్లాలో గంజాయి సాగులేదు. కానీ విశాఖ పట్టణం వైపు నుంచి భారీగా రవాణా అవుతోంది. దీనికి కారణం హైవేకు ఆనుకుని ఉండడం, విస్తృతంగా రైలు సౌకర్యం వుండడంతో గంజాయి వ్యాపారులకు సౌకర్యంగా ఉంది. ముందుగా రవాణాకు చెక్ పెడితే తరువాత దానికదే దారులు మూసుకుంటుంది. ఎప్పుడైతే గంజాయి అందుబాటులో లేకుండా పోతుందో అప్పుడు దాన్ని వాడకం కూడా తగ్గిపోతుందన్నది నా నమ్మకం. అంతటితో ఊరుకోకుండా గంజాయి వినియోగం వలన కలిగే కష్టనష్టాలను ప్రచారం చేస్తాం. విద్యార్థులు గంజాయి, ఇతర చెడు వ్యసనాల బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు అన్నీ రకాల వేదికలను ఉపయోగించుకునేందుకు ప్రాధాన్యత ఇస్తాను. వారికి కెరీర్ మీద దృష్టి సారించే విధంగా కౌన్సెలింగ్ ఇస్తే ఉపయోగం ఉంటుంది. గంజాయి కట్టడిలో ప్రజలను భాగస్వాములను చేస్తాను. ప్రజలు భాగస్వాములు కాకుండా ఏ కార్యక్రమం కూడా సక్సెస్ కాదు.

బహిరంగ మద్యపానంపై కొరడా...

బహిరంగ మద్యపానం అనేది ఒక సమస్యగా నేను పరిగణిస్తున్నాను. దీని వలన సమాజంలోని వ్యక్తులు ఇబ్బందులకు గురికావడం జరుగుతుంది. ముఖ్యంగా మహిళలు, బాలికలు, చిన్నారులు బాధితులవుతున్నారు అందువలన బహిరంగ మద్యాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటాను. ఎవరైనా సరే బహిరంగంగా మద్యం సేవిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా వుంచడం జరుగుతుంది. ఇది ప్రతిఒక్కరి బాధ్యతని గుర్తు చేస్తున్నాను.

అసాంఘిక శక్తులను వదిలిపెట్టేది లేదు...

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వదిలిపెట్టే సమస్యే లేదు. గంజాయి కావచ్చు, మద్యం కావచ్చు, అరాచకాలు, రౌడీయిజంలాంటి వాటిని ఉపేక్షించేది లేదు. ఎంతటివారైనా సరే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటా. ప్రజలను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోలేము కదా. శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇవ్వడం, ప్రజలకు భద్రత కల్పించడమే పోలీసు విధుల్లో ప్రధానమైన కర్తవ్యంగా నేను భావిస్తున్నాను.

మహిళల రక్షణకు ప్రాధాన్యత..

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తాం. మహిళలు, బాలికలు, చిన్నారుల మీద జరిగే నేరాలను అరికట్టేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తా. మహిళల రక్షణకు సంబంధించిన కేసులను వెంటనే నమోదు చేయడం, సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు ప్రారంభించడం వంటి చర్యలు తీసుకుంటాం. మహిళల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చూపినా.. అలసత్వం ప్రదర్శించినా ఉపేక్షించేదిలేదు. పోలీసు అధికారులు, సిబ్బంది మహిళలు, బాలికల సమస్యలపై అప్రమత్తంగా వుండాలని సూచనలు ఇవ్వడం జరిగింది. మహిళలు ముందుకు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. పోలీసులు సకాలంలో స్పందించ పోతే నా దృష్టికి తీసుకురావాలి.

పోలీసుల్లో జవాబుదారీతనం పెంచేందుకు కృషి..

పోలీసు ఉద్యోగం అంటేనే బాధ్యత కలిగిన ఉద్యోగం. సమాజంలో ఎక్కడేం జరిగినా ముందుగా స్పందించేది పోలీసులే. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా అక్కడ ప్రత్యక్షమయ్యేది పోలీసులే. ప్రజల పట్ల పోలీసులు జవాబుదారీతనంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతో వుంది. పోలీసులంటే ఒక స్నేహితుడన్న భావన ప్రజల్లో పెంచాల్సిన బాధ్యత పోలీసుల మీదనే వుంది. పోలీసుల్లో జవాబుదారీతనం పెంచేందుకు కృషి చేస్తా. విధులపట్ల మరింత అంకితభావంతో పనిచేసేలా చూడడం నా బాధ్యతగా భావిస్తున్నా. అలాగే, అవినీతిని అరికట్టి నిజాయితీగా విధులు నిర్వహించేందుకు కృషి చేస్తా.



క్లుప్తంగా

ఓబులక్కపల్లిలో పట్టపగలే చోరీ

● రూ. 4 లక్షల విలువైన సొత్తు అపహరణ


దుండగులు చోరీ చేసిన బీరువా

పెద్దారవీడు: మండలంలో ఓబులక్కపల్లి గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన దుగ్గెంపూడి మల్లారెడ్డి కుటుంబ సభ్యులు పొగాకు నారు వేసుకునేందుకు ఉదయం పొలానికి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వచ్చి చూడగా ఇళ్లంతా దుస్తులు, వంటపాత్రలు, బియ్యం బస్తాలు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో భయంతో చుట్టుపక్కల వారికి విషయం తెలియజేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి పరిశీలించగా బీరువాలోని రూ.40 వేల నగదు, బంగారు కమ్మలు, బుట్టలు, ఉంగరాలు, నల్లపూసల దండా అపహరణకు గురైనట్లు గుర్తించారు. వాటి విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులను విచారించారు. రెండు రోజుల నుండి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నారని, వారే దొంగతనానికి పాల్పడి ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు.

గమ్యం చేరని గమనం..!

నల్లమల అభయారణ్య పరిధిలో రహదారులు రక్తమోడుతున్నాయి. అతివేగం, నిద్రమత్తు, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపటం ఇలాంటి కారణాలతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. అయితే ప్రమాదాల నివారణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదు. గత 10 నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృత్యువాత పడగా పదుల సంఖ్యలో గాయాలయ్యాయి.

- ● రక్తమోడుతున్న రహదారులు
- ● 10 నెలల కాలంలో 8 రోడ్డు ప్రమాదాలు
- ● ఏడుగురు మృత్యువాత, మరో 10 మందికి గాయాలు
- ● ప్రమాదాల నివారణ చర్యల్లో అధికారుల విఫలం


కర్నూల్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో చిన్నారిలో సహా మృతి చెందిన మహిళ (ఫైల్)

పెద్దదోర్నాల: మండల పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా కర్నూల్–గుంటూరు రోడ్లతో పాటు, శ్రీశైలం ఘాట్ రోడ్డులో జరుగుతున్న ప్రమాదాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. అధిక వేగం, నిద్రలేమి, అనుభవరాహిత్యంతో పాటు మద్యం మత్తు, పలు కారణాలతో పాటు, ఘాట్ రోడ్లలోని కొన్ని ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయటంలో అధికారుల నిర్లక్ష్యం, బోర్డులు ఏర్పాటు చేసినా చెట్లకొమ్మలు పెరిగి అవి పొదలమాటున ఉండటం వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ఆరు ప్రమాదాలు..ఏడుగురు మృతులు

గత ఏడాది నవంబర్ నుంచి 10 నెలల కాలంలో 6 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇక స్వల్ప గాయాలతో బయటపడిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు. శ్రీశైలం ఘాట్ రోడ్డుతో పాటు, కర్నూల్, గుంటూరు ప్రధాన రహదారుల్లో జరిగిన ఈ రోడ్డు ప్రమాదాలు రహదారులు సరిగా లేక పోవటంతో పాటు, వాహనాల అతి వేగం వల్లే జరగడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.

✔ కర్నూలు– గుంటూరు రోడ్డులోని వెలిగొండ ప్రాజెక్టు వద్ద గత ఏడాది నవంబర్ 19న లారీ ఢీకొన్న సంఘటనలో ఓ చిన్నారి సహా మహిళ దుర్మరణం పాలవ్వగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.

✔ ఏప్రిల్ 4న కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిలో గంటవానిపల్లె సమీపంలో మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.

✔ ఆగస్టు 19న మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులో చిన్నారుట్ల సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడగా వ్యక్తి మృతి చెందాడు.

✔ ఆగస్టు 9న మండల పరిధిలోని ఐనముక్కల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ నుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందింది.

✔ సెప్టెంబర్ 12న కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిపై కొర్రపోలు ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

✔ సెప్టెంబర్ 17న బైక్‌పై వెళుతున్న ఓ గిరిజనుడిని అడవి పందులు ఢీకొనడంతో బోల్తా పడి దుర్మరణం పాలయ్యాడు. అదే రోజు బైక్ అదుపు తప్పి బోల్తా పడగా తీవ్రంగా గాయపడిన వ్యక్తి కర్నూలులో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

✔ సెప్టెంబర్ 18న వేగంగా ప్రయాణిస్తున్న కారు టైర్ బస్ట్ కావడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడింది. ఈ సంఘటన మండల పరిధిలో శ్రీశైలం రహదారిలోని ఈద్గా వద్ద జరిగింది. ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.


చిన్నారుట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కడప జిల్లా వ్యక్తి (ఫైల్)

నివారణ చర్యలు శూన్యం..

వరుస ప్రమాదాలను నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారిపై ఆర్‌టీఏ, పోలీస్ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించి అనుమతి, ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనం నడిపే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అలాగే మద్యం తాగి వాహనాన్ని నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, మితిమీరిన వేగంతో వాహనాన్ని నడిపే వారిని గుర్తించి వారిపై భారీగా జరిమానాలను విధించాల్సిన అవసరం ఉందంటున్నారు.


కొర్రప్రోలు చెక్ పోస్టు వద్ద బోల్తా పడ్డ ఆటో(ఫైల్)


శ్రీశైలం రహదారిలో అదుపు తప్పి బోల్తా పడ్డ కారు(ఫైల్)

తిరగలదిన్నె ఆలయంలో చోరీ


చోరీ తీరును పరిశీలిస్తున్న ఎస్సై కిషోర్‌బాబు

పామూరు: మండలంలోని తిరగలదిన్నె గ్రామ సమీపంలోని దక్షిణామూర్తి ఆలయంలో చోరీ జరిగింది. ఈ ఘటన బుధవారం ఉదయం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఆలయం ముందు హాలులో ఉండే హుండీలను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి తీసుకుపోయి సమీపంలో పగులగొట్టి నగదు తీసుకుపోయారు. దీనిపై ఓబుల్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఒంగోలు సిటీ: 2026–27 విద్యా సంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో 9,11 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు అక్టోబర్ 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సి.శివరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 8, 10 తరగతి చదువుకున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అప్లికేషన్ కావాల్సిన వారు నేరుగా సంప్రదించాలన్నారు.

ఘాట్‌రోడ్డులో నిలిచిన లారీ

- ● భారీగా స్తంభించిన ట్రాఫిక్
- ● దిగువమెట్ట చెక్‌పోస్టు వద్ద వాహనాల నిలిపివేత
- ● 3 గంటల పాటు నిలిచిన వాహనాలు


రోడ్డుపై నిలిచిన భారీ క్రేన్‌తో లారీ

గిద్దలూరు రూరల్: నల్లమల ఘాట్‌రోడ్డులో భారీ క్రేన్‌తో వెళుతున్న లారీ నిలిచిపోయింది. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని దిగువమెట్ట సమీపంలోని బెంగళూరు నుంచి విజయవాడకు భారీ క్రేన్‌తో వెళుతుండగా నల్లమల ఘాట్ రోడ్డులో బుధవారం భారీ క్రేన్‌తో వెళుతున్న ఓ లారీ సాంకేతిక మరమ్మతులతో ఆగిపోయింది. దీంతో దీంతో నంద్యాల నుంచి గిద్దలూరు వైపుగా వస్తున్న వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళ్లే వాహనాలను దిగువమెట్ట చెక్‌పోస్టు వద్ద నిలిపివేశారు. భారీ క్రేన్‌తో నిలిచిపోయిన లారీని బాగు చేయించి రోడ్డుకు అడ్డం లేకుండా పక్కకు తీయించారు. రోడ్డుపై వాహనాలు కిలో మీటరు మేర నిలిచిపోయాయి. సుమారు 3 గంటల పాటుగా ట్రాఫిక్ సమస్య తలెత్తి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం


క్రీడాకారులతో క్విస్ విద్యాసంస్థల చైర్మన్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: జిల్లా అండర్–18 కబడ్డీ జట్టుకు స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ బుధవారంతో ముగిసింది. విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ, మెళకువలు నేర్పించినట్లు ప్రకాశంజిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.భాస్కర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆటగాళ్లకు వసతి, సౌకర్యాలు కల్పించినందుకు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎస్ రంగారావు, కార్యదర్శి వై. పూర్ణచంద్రరావు, కోశాధికారి డి.రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీనయ్య పాల్గొన్నారు. వినోద్, సుప్రజ, భవాని తదితరులు ఆటగాళ్లకు ప్రత్యేక శిక్షణ అందించారు.

విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

● వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు


మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి

ఒంగోలు సిటీ: విద్యార్థులు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ సమావేశం హాలులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విభాగం 1969 సెప్టెంబర్ 24వ తేదీన ఏర్పాటైందని, ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడిచే ఒక గొప్ప వాలంటరీ సంస్థ అని అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని ఇటువంటి సంస్థ ద్వారా భారతదేశంలో వైద్య ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమాలు, మొక్కల పెంపకం, పచ్చదనం–పరిశుభ్రత, జాతీయ సమైక్యత, మహిళా చైతన్యం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సేవా కార్యక్రమాలు, ప్లాస్టిక్ నిర్మూలన, నేత్రదాన శిబిరాలు వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ కార్యక్రమాలు చేపడుతూ సమాజ సేవలో భాగస్వాములు కావడం హర్షించదగిన విషయమని అన్నారు. కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్ కుమార్ అధ్యక్షత వహించారు.

బాబు మోసాలను ఎండగడదాం

- ● ఎన్నికల హామీల అమలులో కూటమి సర్కారు విఫలం
- ● ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అప్పనంగా ప్రైవేట్‌కు కట్టబెడుతున్నారు
- ● బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు


బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న చుండూరి రవిబాబు, ఇతర నేతలు

కొత్తపట్నం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మండిపడ్డారు. మండలంలోని పిన్నింటివారిపాలెం, గుండమాల, మోటుమాల గ్రామాల్లో బుధవారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రాన్ని దోచుకోవడమే తప్ప ఎటువంటి అభివృద్ధి లేదన్నారు. దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 17 కాలేజీలను నిర్మాణం ప్రారంభించారన్నారు. ఆ కాలేజీల ద్వారా ఏటా 5 వేల మంది డాక్టర్లు వైద్యులు బయటకు వస్తే ఎంతో మంది భవిష్యత్ మారుతాయన్నారు. కాలేజీ కూటమి ప్రభుత్వం ప్రభుత్వంకాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకం ఎన్నో లక్షల కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ పథకానికి నిధులు ఇవ్వకపోవడంతో నిర్వీర్యమవుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ గ్రామాన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్ సెంటర్లు నిర్మించి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేశారన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు నిర్మించారని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్ సీపీ హయాంలో పాలన సాగిందన్నారు. కానీ కూటమి అధికారంలోకి అవినీతి, అక్రమాలు మాత్రమే కనిపిస్తున్నాయని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నేరుగా మహిళల ఖాతాలకే నగదు జమ చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరన్నారు. మత్స్యకారుల సంక్షేమానికీ ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే మత్స్యకార భరోసా కూడా కొంతమందికి అందలేదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో మండలంలో రూ.21 కోట్లతో విద్యుత్ లైన్లు, స్తంభాల ఆధునికీకరణ చేశామన్నారు. గుండమాల గ్రామస్తులకు సాగు భూముల పట్టాలు, గుండమాలలో వేటకు వెళ్లి మరణించిన యానాది కుటుంబానికి మత్స్యకార ఇన్సూరెన్సు కింద రూ.10 లక్షలు ఇచ్చామని గుర్తు చేశారు. అనంతరం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, సైకం రాంబాబు, గుండమాల, మోటుమాల సర్పంచ్‌లు కారాని జయరావు, కోడూరి గోపిరెడ్డి, వెంకటరెడ్డి, గాలి ముసలారెడ్డి, మల్లికార్జున, వెంకటనారాయణ, అప్పాడి సురేష్, గొల్లపోతు వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో తాగునీటి అవసరాలు తీర్చాలి

- ● అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి
- ● మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాజాబాబు


మున్సిపల్ కమిషనర్లతో సమీక్షలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని ఒంగోలు నగర కార్పొరేషన్‌తో పాటు అన్ని మున్సిపాలిటీల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి. రాజాబాబు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ అధికారులు, పబ్లిక్ హెల్త్, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో సమావేశమై ఆయా శాఖల ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల అమలు తీరును, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ డ్రై వేస్ట్ నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పటిష్టంగా అమలయ్యేలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒంగోలు నగరంలోకి ప్రవేశించే ప్రదేశాన్ని పూర్తి స్థాయిలో సుందరీకరణంగా అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. నగరంలో చేపట్టిన ప్రధాన కాలువల పూడికతీత పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రానున్న సంవత్సరాల్లో ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా రూ.100 కోట్లు రెవెన్యూ జనరేట్ చేసేలా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వర రావు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంజయ్ కుమార్, అన్నీ మున్సిపాలిటీల కమిషనర్లు, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఈ–పంట త్వరితగతిన నమోదు చేయాలి

- ● ఈ నెలాఖరులోగా నమోదు పూర్తి చేయాలి
- ● వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షలో జేసీ గోపాలకృష్ణ


వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ఈ–పంట నమోదు త్వరితగతిన నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వ్యవసాయ అధికారులకు, సహాయ వ్యవసాయ సంచాలకులకు ఈ–పంట నమోదుపై కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటికి జిల్లాలో మొత్తం 15,68,517 భూ కమతాలకు గాను 4,63,071 భూ కమతాలు మాత్రమే అంటే 30 శాతం నమోదు చేశారన్నారు. సెప్టెంబర్ 30వ తేదీ లోపల నమోదు పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారులందరూ గ్రామ వ్యవసాయ సహాయకులకు రోజుకు 100 కమతాలు చొప్పున లక్ష్యంగా నిర్దేశించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలేమైనా ఉంటే వెంటనే సవరించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావును ఆదేశించారు. జిల్లా సరాసరి కన్నా తక్కువగా నమోదు చేసిన వ్యవసాయ అధికారులను చేయకపోవటానికి కారణాలను చెప్పమని కోరారు. సహాయ వ్యవసాయ సంచాలకులను మీ పరిధిలోని మండలాలను లక్ష్యంగా పెట్టుకొని పూర్తిచేసేట్టుగా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి గోపీచంద్, ఉద్యానవన శాఖ అధికారులు గ్రామ సహాయకులు చేసిన రికార్డ్స్‌ను ఆమోదించటంలో వెనకబడి ఉన్నారని, త్వరగా చేయాలని ఆదేశించారు. జియో ఫెన్సింగ్ 20 మీటర్ల నుంచి 100 మీటర్లకు పెంచితే బీడు కమతాలను తొందరగా పూర్తిచేయవచ్చని, అదే విధంగా చివరి తేదీ అక్టోబర్ 15 వరకు పొడిగించాలన్న విషయాలను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకువెళతానని జేసీ చెప్పారు. బ్లాక్ బర్లీ పొగాకు సాగును కట్టడి చేయాలని ఆదేశించారు. యూరియా అందరికీ అందుబాటులో ఉండేటట్లుగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి వి. సుభాషిణి, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.